


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### స్వీట్ హోం

**ఎవరో హాస్య నవలల** గురించి మాట్లడమన్నారు. నా చిన్నప్పటినుండీ మా ఇంట్లో అమ్మమ్మా, పెద్దమ్మల నుండీ చదివి ఆనందిస్తున్న నవల రంగనాయకమ్మగారి 'స్వీట్ హోం.'

అసలు ఇంత పెద్దయ్యాక నవ్వొస్తుందో లేదో చూడాలని మళ్ళీ నవోదయా వారి దగ్గర మూడూ భాగాలూ కలిసి వున్న పుస్తకాన్ని పోస్ట్ ఖర్చులతో కలిసి 255/– రూపాయిలకే తెప్పించి చదవడం మొదలు పెట్టాను. ఏమీ తేడా లేదు. చిన్నప్పుడు నవ్వినట్టే మళ్ళీ నవ్వాను. ఉన్న తేడా అల్లా రంగనాయకమ్మగారు కింద రాసిన ఫుట్ నోట్స్, నేను ఇలా రాయకుండా వుండాల్సిందీ, అలా ఆ పదం వాడకుండా వుండాల్సిందీ.. అంటూ.. ఫరవాలేదు. మార్చుకునే వెసులుబాటున్నప్పుడు ఆవిడ మార్చుకోవచ్చు.

ఈ నవల ప్రారంభం అయ్యేటప్పటికే విమలకీ, బుచ్చిబాబుకీ ఒక కొడుకు రవీ, కూతురు పాపాయీ వుంటారు. ఐదారేళ్ళ వాళ్ళు. పాపాయికి పేరు పెట్టడం ఎందుకులే, పెద్దయి తనే పెట్టుకుంటుంది ఇష్టం వచ్చిన పేరు అని వదిలేసారు. బుచ్చిబాబు వృత్తి రీత్యా లాయర్. అతని దగ్గరకొచ్చిన క్లయింట్లని పాపాయి పేరు పెట్టమని అడిగితే వాళ్ళు పొంగిపోయి సీతామహాలక్ష్మి అనీ పద్మిని అనీ పెడితే, "అమ్మా నేను పందిని" అని పాపాయి ఒక రోజంతా గంతులేస్తుంది.

ఇంట్లోనే లాయర్‌గారికి ఆఫీస్ రూం వుంటుంది. అందులో రమణయ్యగారూ, జూనియర్ చంద్రం, రాజూ పని చేస్తుంటారు. సుబ్బలక్ష్మి అనే జూనియర్ అప్పుడప్పుడూ వచ్చి, విమల దగ్గర పత్రికలు చదువుకునీ, తన అందం పరిరక్షించుకునే విధానాలు చెప్పి, వెళ్ళిపోతుంటుంది. అస్సలు ఇంత ఎల్.ఎల్.ఎం. చదువుకున్నానే పని చెయ్యాలనే ధ్యాస వుండదు. ఆఫీస్ రూములోనే పాపాయి లక్కపిడతలు పెట్టుకుని ఆడుకుంటూవుంటుంది.

విమల మూడ్ బావుంటే అప్పుడప్పుడూ ఉప్మాలూ, కారప్పూసా, కాఫీలూ ఆఫీస్‌లో వాళ్ళకి అందిస్తూ వుంటుంది.

బుచ్చిబాబు మాట్లాడేటప్పుడు తడబడి  తిరగేసి మాట్లాడుతుంటాడు "పిల్లలూ కప్పలేసేసా పడుకోండి" అంటాడు.

"అమ్మా నాన్న మళ్ళీ కప్పలంటున్నాడు పక్కలని" అని పిల్లలు కంప్లయింట్ చేస్తారు.

"చీకట్లో చెట్ల దగ్గర ఆడకండి. పుగుర్లు కుడ్తాయి" అంటాడు పురుగులకి.

"బుచ్చిబాబూ, వాళ్ళకి కాళ్ళూ చేతులూ కడిగి, అన్నాలు పెట్టేసెయ్" అని విమల అంటే

"రండి కాళ్ళూ చేతులూ కడిగేస్తా" అంటాడు.

బాబు "ఎందుకు నాన్నా రెండూ కదుక్కోవడం?" అంటే .

"నిజమే కాళ్ళు కదుక్కోండి చాలు.. అన్నం తినడానికి ముఖ్యం కదా" అంటాడు.

"ఏ చెయ్యి కదుక్కోనూ?" పాపాయి అడుగుతుంది.

"ఇదిగో.. అన్నం చెయ్యి" అని పట్టుకుంటాడు.

పాపాయి "ఇది కాదు అన్నం చెయ్యి" అంటే

"ఓ అటు తిరిగి నిలబడ్డావా? అందుకే నాకు తెలీలేదు" అంటాడు.

సామెతలు కూడా చెప్పాలని ఉబలాటపడ్తుంటాడు బుచ్చిబాబు.

"విమలా ఒక పిట్టకి రెండు దెబ్బలు" అంటాడు,

"గత సేతు జలబంధనం ఎందుకులే?" అంటాడు.

మరీ తొందరలో వుంటే ఇంకా తడబడి "విమలా మధ్యాహ్నం పోస్ట్‌మేన్ మనింట్లో నిద్రపోతున్నాడా, నేనొచ్చినప్పుడూ?" అంటాడు.

విమల కోపంగా "పోస్ట్‌మేన్ మనింట్లో నిద్రపోవడం ఏమిటి బుచ్చీ? మతిపోయిందా?" అంటుంది.

"అదే! పోస్ట్‌మేన్ మధ్యాహ్నం వచ్చినప్పుడు, నువ్వు నిద్రోయావా? ఉత్తరాలేం లేవూ?" అని సరిదిద్దుకుంటాడు.

కోర్టులో అర్జీలు రాసేటప్పుడు కూడా విమల సాయం అడుగుతుంటాడు, "విమలా రామయ్య తోచక చేను దగ్గరకి వెళ్తే, కట్టు తెగుతుంది.. అని రాయనా?" అంటాడు.

"ఆ రామయ్య పొలం కాస్తా హరీ అంటుంది. రైతు పనిమీద చేను దగ్గరకి వెళ్ళాలి కానీ తోచక ఏవిటీ?" అంటుంది విమల.

అసలు చెప్పదలుచుకున్నది సగం నుండీ మొదలు పెడ్తాడు" రమ్మంటే రాడు. వచ్చాక ఇస్తా వివరాలు " అంటాడు కోపంగా ఇంట్లోకి వస్తూనే.

"ఎవరు బుచ్చీ?" అంటుంది విమల.

"అతనే.. చారల షర్ట్ వేసుకుంటాడూ?" అంటాడు.

"లాగూ వేసుకుంటాడు, రెండు కాళ్ళూ, రెండు చేతులూ కూడా వుంటాయి కదూ!" అని ఆటపట్టిస్తుంది విమల.

"అరె! ఎంత కరెక్ట్‌గా చెప్పావో" అంటాడు.

ఇంకోసారి "ఆవిడ నిన్ను అడిగానని చెప్పమంది విమలా" అంటాడు వస్తూనే.

"ఎవరూ?" అంటుంది.

"ఆవిడే జడేసుకుంటుందీ, చెవులకి జడగంటలు పెట్టుకుంటుందే? ఆవిడ" అంటాడు.

"చెవులకి బుట్టలోలాకులు పెట్టుకుంటారు, జడగంటలు కాదు. మొహమూ, రెండు చేతులూ, రెండు కాళ్ళూ వున్నాయి... లాంటి పోలికలు చెప్పకు" అంటుంది విమల.

బుచ్చి అప్పుడప్పుడూ పిల్లలకి చదువుకూడా చెప్తాడు.

బాబుతో "రెండుకి రెండు కలిపితే నాలుగు అనమాట" అంటాడు.

"రెండుకి రెండు ఎందుకు కలపాలీ?" అంటాడు బాబు.

"ఎందుకంటే ఎప్పుడైనా కావలంటే కలపాలి" అంటాడు బుచ్చిబాబు.

"నాకొద్దు. నేను కలపను" అంటాడు బాబు.

"రవి ఎదురు ప్రశ్నలు వేస్తున్నాడు విమలా" అని కంప్లయింట్ చేస్తాడు బుచ్చిబాబు.

"సరే.. ఆ సైన్స్‌లో సున్నా వచ్చింది వాడికి, అవి చెప్పు" అంటుంది విమల.

బుచ్చి పుస్తకం పట్టుకుని "శరీరంలో ఏవైనా మూడు ముఖ్యభాగాలు చెప్పూ" అంటాడు.

బాబు "రెండు చేతులూ, ఒక కాలూ" అంటాడు.

"రెండో కాలేం చేసిందీ?" అంటాడు బుచ్చిబాబు.

"నువ్వు మూడు అన్నావుగా అది కలిపితే నాలుగవుతాయి" అంటాడు బాబు.

విమల వచ్చి "దిక్కుమాలిన ప్రశ్నలు అసలు శరీరంలో ముఖ్య భాగాలేంటీ? ముఖ్యం కానివి ఎందుకుంటాయీ? మూడు ముఖ్యభాగాలంటే తలా, మొండెం, కాళ్ళూ చేతులూ అని చెప్పాలి" అంటుంది."

అయ్యో! తల ఎలా మర్చిపోయాం? అని తండ్రీ కొడుకూ తల కొట్టుకుంటారు.

అసలు ఈ విమలా బుచ్చిబాబుల పెళ్ళి ఎలా అయిందంటే, బుచ్చికీ విమల అన్న మధుసూధనంకీ స్నేహం. మోకాళ్ళు మునిగిపోయేట్టు పొడుగు పొడుగు చొక్కాలు వేసుకొచ్చే బుచ్చిని ఆటపట్టిస్తుంటుంది విమల. ఒక రోజున "మధుసూధనం వున్నాడాండీ?" అని అడిగినప్పుడు "లేదు" అని విమల అంటే, బుచ్చి చాలా స్నేహంగా చూసి వెళ్ళిపోతాడు. అతని చూపులో చాలా మంచితనం వున్నట్లు విమలకి అనిపిస్తుంది. తర్వాత "బుచ్చిబాబుకి విమలనిచ్చి పెళ్ళి చేస్తే ఎలా

వుంటుందీ?" అని మధు అడిగినప్పుడు విమల "ఔను ఎందుకు చేసుకోకూడదూ, కావాలంటే కత్తిరించేద్దాం పొడుగు చౌక్కాలు నచ్చకపోతే" అనుకుంటుంది.

బుచ్చి మాత్రం "విమలని అడిగావా? తనని నేనే డైరెక్ట్‌గా అడగొచ్చా?" అంటాడు మధుతో.

అతని విశాల హృదయానికి విమల చాలా సంతోషిస్తుంది. బీచ్‌లో విమలనీ బుచ్చినీ వదిలేసి మధు ఏదో పని వుందన్నట్లు రిక్షా ఎక్కి వెళ్ళిపోతాడు.

అప్పుడు బుచ్చి "నన్ను పెళ్ళి చేసుకోవడం మీకు ఇష్టమేనా విమలా?" అంటాడు.

అప్పుడెప్పుడో చదివిన బెంగాలీ నవలల జ్ఞానంతో విమల "మీ పాదాల చెంత నాకింత చోటు ఇవ్వండి చాలు" అంటుంది.

"ఛీ! నీ చోటు అక్కడకాదు, నా హృదయంలో" అంటాడు బుచ్చి.

ఇక్కడితో అయిపోలేదు.

సరిగ్గా ముహూర్తాలు పెట్టేసుకున్నాక బుచ్చిబాబు రాసిన ఒక ప్రేమలేఖ తీసుకున్న విమల "ఇతన్ని పెళ్ళి చేసుకోడం నావల్లకాదు" అంటుంది.

"ఏమైందిరా ఏం చేసావు?" అని మధుసూధనం తల పట్టుకుంటాడు.

విమల "మధ్యలో మేటర్ చదవకు ఆ ఉత్తరం దేనిమీద రాసాడో చూడు" అంటుంది.

మధు ఊత్తరం చూస్తాడు. ఆ ఉత్తరం తిప్పి చూస్తే అదేదో విడాకుల అర్జీ, దానిమీద తిరగేసి బుచ్చి ప్రేమలేఖ రాసేసాడు.

"విడాకుల కాయితం మీద రాసిన ప్రేమలేఖ మా భవిష్యత్ చెప్తోంది. పైగా నా పేరు ఎలా రాసాడో చూడు "వి.." ఒక లైన్‌లో.. 'మల' అని రెండో లైన్‌లో రాసాడు. అప్పుడే నా పేరు చిత్రిక పట్టేసాడు" అంది విమల.

విమల రాసిన ఉత్తరం సుగంధ పరిమళాలతో గులాబీరంగు కవర్లో ఎంతో ముద్దొస్తోంది.

మధు "బుచ్చీ ఏవిట్రా ఇదీ?" అంటే, ఆ ఉత్తరం లాక్కుని బుచ్చి ఆఘమేఘాల మీద వెళ్ళిపోయి మళ్ళీ వేరే సాపు రాసుకొచ్చి ఇచ్చాడు.

ఆ విధంగా మొత్తానికి విమలకీ బుచ్చిబాబుకీ పెళ్ళి అయింది.

బుచ్చి "అసలు మా అమ్మ చిన్నప్పుడే పోయింది తెలుసా విమలా?" అంటాడు.

"అదేమిటి చిన్నప్పుడే పోతే నువ్వెలా పుట్టావ్?" అంటుంది విమల.

"నా చిన్నప్పుడు విమలా.. మా అమ్మమ్మా, పెద్దమ్మా నన్ను పెంచారు. మా అత్త పినాసి పాపమ్మ. పాలల్లో నీళ్ళు కలిపి అమ్మేది. దూడలకి పాలు వదిలి పెట్టకుండా ఎన్ని దూడలని చంపిందో తెలుసా?" అంటాడు.

ఆ పాపమ్మ కాలవలో నీళ్ళులాంటి మజ్జిగ డబ్బులు తీసుకుని పోసేదని చెప్పి చెప్పి బాధపడుతుంటాడు.

ఇవన్నీ బుచ్చిబాబు విషయాలైతే, ఇంక విమల సంగతేవిటీ? మహిళా సభకి వెళ్ళొచ్చిన విమలకి తను తన కాళ్ళమీద నిలబడడం లేదని, అర్జెంటుగా ఏదైనా ఉద్యోగం చేసెయ్యాలనీ ఆలోచన వస్తుంది. దాంతో ఒకరోజు 'ఇక్కడ బట్టలు ఇస్త్రీ చెయ్యబడును' అన్న బోర్డ్ ఒకటి రాసి "బుచ్చీ ఎలా వుందీ?" అని చూపిస్తుంది.

"ఏంటీ బట్టలు ఇస్త్రీ చేస్తావా?" అని బుచ్చి ఆశ్చర్యపోతాడు.

అది కాని పని అని తెలిసాక "బుచ్చీ నేను రైళ్ళు నడుపుతాను. రైల్వే డ్రైవర్ ఉద్యోగం చేస్తాను" అంటుంది.

"అన్నేసి వేల మైళ్ళు రైల్లో వెళ్ళిపోయాక, మళ్ళీ ఇంటికి ఎప్పుడొస్తావ్ విమలా? నేనూ పిల్లలూ కూడా ఇంజన్ పెట్టెలో చాపవేసుకుని కూర్చుంటాం" అంటాడు బుచ్చి.

విమలకి ఒళ్ళు మండిపోతుంది "ఇంతమంది రైల్వేలో మగాళ్ళు డ్రైవర్లుగా చేస్తున్నారు. వాళ్ళ పెళ్ళాలూ, పిల్లలూ చాప వేసుకుని ఇంజన్ పెట్లో కూర్చుంటారా?" అని అడుగుతుంది.

అబ్బాయి అయితే "అమ్మా రైలు మనింటిదాకా తీసుకొస్తావా? నన్ను స్కూల్లో దిగబెడ్తావా?" అని అడుగుతాడు.

వాడి ఫ్రెండ్ లమేషు "పట్టాలు వుండాలిరా రైలు రావాలంటే" అని చెప్తాడు.

కొన్నాళ్ళు ఈ రైల్వే డ్రైవర్ ఉద్యోగం కోసం తిరిగి అదీ కుదరదని తెలుసుకున్న విమల పోస్ట్ ఉమెన్ ఉద్యోగం చేస్తానంటుంది. విమలకి సైకిల్ నడపడం బాగా వచ్చు. పోస్ట్ మేస్టర్ దగ్గరకి వెళ్ళి అడిగితే అతను మాటి మాటికీ నోరు తెరిచి ఆశ్చర్యపోయి ఆ తర్వాత ప్రకటనలు పడినప్పుడు అప్లై చేద్దువుగాని లేమ్మా అని పంపించేస్తాడు.

విమలకి బుచ్చిబాబు సిగరెట్లు కాలుస్తాడని తెలుసు పెళ్ళికి ముందే. కానీ పెళ్ళయ్యాక మానిపించేద్దాం అనుకుంది. అది మానిపించలేకపోయింది సరికదా, స్నేహితులొచ్చి పేకాట వేసుకుంటే, ఉప్మాలూ,కాఫీలు అందించి ఎంకరేజ్ చేసింది. తర్వత ఆ పేకాట మానిపించడం తలకి మించిన పనైంది.

తర్వాత బుచ్చిబాబు నాటకాలు మొదలు పెట్టాడు. ఆ నాటకాల అమ్మాయి ఒకావిడ ఇంటిదాకా వచ్చేసింది బుచ్చి కోసం. ఇలా అనేక వ్యసనాల బారినుండి బుచ్చిని విమల కాపాడుకుంటూ వచ్చింది. బుచ్చిలో విమలకి నచ్చని గుణం, తనతో కలిసి నడుస్తున్నప్పుడు తను వస్తున్నానా లేదా అని పట్టించుకోకుండా, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ అంగదుడులా వెళ్ళిపోవడం.

అలాగే ఒకరోజు ఇద్దరూ కలిసి సినిమాకని బయల్దేరారు. స్నేహితుడెవరో తగిలాడు. అంతే బుచ్చి అంగలేసుకుంటూ విమలని మర్చిపోయి అతనితో చాలా దూరం వెళ్ళిపోయాక, వెనక్కి తిరిగి చూసుకున్నాడు. విమల జాడలేదు. ఆ స్నేహితుడిని " మా ఆవిడ్ని చూసావా?" అంటాడు.

"మీ ఆవిడెవరూ?"

"తెల్లచీర కట్టుకుందీ?"

"ఓ ఆవిడా! వెనగ్గా నడుస్తూ వచ్చింది. ఇందాక మనముందు నుండేగా రిక్షా ఎక్కి వెళ్ళిపోయిందీ" అంటాడు ఆ స్నేహితుడు.

బుచ్చి 'కొంప మునిగిపోయింది ' అని పరిగెత్తుకుంటూ ఇంటికెళ్ళి 'విమలా.. ఏవీ నీ కాళ్ళు? మళ్ళీ ఎప్పుడూ అలా చెయ్యను" అని బతిమాలతాడు.

విమల కూరా, పప్పూ, చారూ చేసి అన్నం గిన్నె మీద రెండు మెతుకులేసి, పేపర్లో "చారు ఒక్కటేకాదు పప్పూ, కూరా కూడా వేసుకుని తిను" అని అంటించి, పనిమీద బయటికి వెళ్తుంది.

బుచ్చి ఆ అన్నం గిన్నెమీద కాయితం తీసి అవతల పారేసి చారేసుకుని అన్నం తినేసి, పళ్ళెం కడగడానికి పారేసి విమలకి ఎదురొస్తాడు. "పప్పూ కూరా వేసుకున్నావా" అంటే "ఏమో నాకు కనపడలేదు" అంటాడు.

"కాయితం మీద రాసాగా" అంటే, "అదా? తీసి పారేసా" అంటాడు.

విమల విమెన్స్. లిబ్ ఉద్యమం... బుచ్చిబాబు అవకతవకల పనులతో వాళ్ళకాపురం భలేగా వుంటుంది. పేదరికాన్ని సరదాలుగా తీసుకుంటూ అతుకుల చిరుగుల షర్ట్ మీద బుచ్చి బ్లాక్ గౌన్ కప్పుకుని సరదాగా సాగిపోతుంటుంది. చెవులకీ, చేతులకీ మెడలో ఒక్క నల్లపుసైనా లేని విమలని చూసి అంతా ఆశ్చర్యపోతున్నా, పీనాసి పాపమ్మ కూతురు సుబ్బులులాంటి వాళ్ళు మొహానే అన్నా, విమల చిరునవ్వుతో "మేం సుఖంగా వున్నాం లెద్దూ" అంటుంది.

బుచ్చి విమల షర్ట్లన్నీ మోకాళ్ళ మీదకి కత్తిరించేసినా, ఫరవాలేదు పైన కోటుందిగా అంటూ చిద్విలాసంగా కోర్టుకి వెళ్ళిపోతాడు.

ఆనందంగా వుండాలంటే కావలసింది డబ్బుకాదు, భార్యాభర్తలు ఒకరిని ఒకరు గౌరవించుకోవడం, ప్రేమించుకోవడం అని రంగనాయకమ్మగారు ఆ రోజుల్లోనే ఎంతో అందంగా రాసిన నవల 'స్వీట్ హోం.'

Post your comments







